పశువుల్లో ఎద.. గుర్తించకపోతే వ్యర్థే!

- ఎద తప్పితే పునరుత్పత్తి తగ్గుదల
- పాడి రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి


ఎదకు వచ్చిన ఆవు, గేదె

బత్తలపల్లి: ఆడ పశువులు యుక్త వయస్సుకు వచ్చిన తర్వాత అండాశయంలో ఉత్పత్తి అయిన హార్మోన్ల ప్రభావంతో ఎద లక్షణాలను వ్యక్తం చేస్తాయి. వీటిని గుర్తించి సకాలంలో కృత్రిమ గర్భధారణ చేయించడం పునరుత్పత్తి యజమాన్యంలో అత్యంత కీలకం. చాలా మంది పాడి రైతులు ఎదను సరిగా గుర్తించకలేక నష్టపోతున్నారు. ఒక ఎద తప్పినా వాటి పునరుత్పత్తి జీవిత కాలంలో నెల తగ్గిపోతుంది. నష్టం విలువ వెయ్యి నుంచి పదిహేను వందలుగా ఉంటుంది. అందువల్ల పశువుల ఎద కాలాన్ని సూచించే లక్షణాలను ప్రతి పాడి రైతూ తెలుసుకుని ఉండాలి. ఈ లక్షణాలను ఎలా గుర్తించవచ్చో బత్తలపల్లి పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి ఇలా చెబుతున్నారు...

ఆవుల్లో ఎద లక్షణాలు ఇలా..

ఆవుల్లో ఎదకాలం 18 నుంచి 24 గంటలు ఉంటుంది. సాధారణంగా ఎదకాలాన్ని మూడు దశలుగా విభజించారు. ఎదకు వచ్చిన ఆవులు తొలిదశలో మంద నుంచి వేరుపడి చికాకుగా ఉంటాయి. ఆకలి మందగించడం వల్ల మేత సరిగా మేయవు. మధ్య దశలో ఇతర ఆవులతో కలిసి ఉన్నా చికాకుగానే ఉంటాయి. ఈ దశలో ఆకలి బాగా పడిపోతుంది. చివరి దశలో చికాకు తగ్గిపోతుంది. మేపు మామూలుగానే ఉంటుంది. తొలిదశలో పాల ఉత్పత్తి తగ్గుతుంది. మధ్య దశలో పాలు బాగా తగ్గిపోతాయి. చివరి దశలో మామూలు స్థితికి వచ్చేస్తాయి. తొలి, మధ్య దశల్లో ఇతర పశువులను నాకుతాయి. తరచూ తోక పైకి లేవుతూ కొద్దికొద్దిగా మూత్రం పోస్తాయి. చివరి దశలో ఐదు నిమిషాలకు ఒకసారి రెండుమూడు సార్లు మలవిసర్జన చేస్తాయి. చిరు మూత్రం పోస్తూ అరుస్తూ ఉంటే ఎదలో ఉన్నట్లు గుర్తించాలి. మానం(మూత్రద్వారం) కూడా ఉబ్బి లోపలి పొర ఎర్రగా నిగనిగలాడుతూ ఉంటుంది. అంతే కాకుండా అవి ఇతర పశువుల మీదకు ఎక్కుతాయి. ఇతర పశువులు ఎక్కినా కదలకుండా ఉంటాయి. చివరి దశలో మాత్రం ఇతర పశువులను ఎక్కనివ్వవు. మానం నుంచి తీగలు వేస్తాయి. తొలిదశలో తీగలు పలుచగా ఉండి నీళ్లలా కనిపిస్తాయి. మధ్యదశలో అవి ఇంకా చిక్కబడి సాగుతూ వేలాడుతుంటాయి. చివరి దశలో తోకపై, తొడపై మచ్చలు అంటుకున్నట్లుగా కనిపిస్తాయి.

గేదెల్లో ఎద లక్షణాలు ఇలా..

తరచూ చిరుమూత్రం పోసే గేదెలు ఎదలో ఉన్నట్లు గుర్తించాలి. కొన్ని ఐదు నిమిషాలకు నాలుగు, ఐదు సార్లు మూత్ర విసర్జన చేస్తాయి. గేదెల్లో ఎద లక్షణాలు 24 నుంచి 36 గంటల పాటు ఉంటాయి. ఈ సమయంలో గేదె చికాకుగా ఉంటూ మేత తినడం మానేస్తుంది. మానం తెరిచి చూస్తే లోపలి పొర ఎర్రగా ఉంటుంది. పాడిగేదెలు ఎదకు వచ్చినప్పుడు పాలు తగ్గుతాయి.

మూగ ఎద ఇలా..

ఎద లక్షణాలు కనిపించకపోవడమే మూగ ఎద అంటారు. ఇది గుర్తించడడం కష్టమేకాని జాగ్రత్తగా గమనిస్తూ ఉంటే సులువుగానే కనిపెట్టొచ్చు. గేదెలు 50 శాతం మూగెదలోనే ఉంటాయి. ఆ సమయంలో అవి కీచుగా అరుస్తాయి. దగ్గరున్న పశువుల్ని, మనుషులను బెదురుగా చూస్తాయి. గేదెలు మార్చి నుంచి ఆగస్టు నెలల్లో ఎదకు వస్తాయి. ఈ మధ్యకాలంలో మూగ ఎద లక్షణాలను గుర్తించడానికి రోజుకు పది నిమిషాలు గేదెల ప్రవర్తనను గమనించాలి. ఎండకాలంలో ఎద లక్షణాలు అన్నీ కనిపించవు. సరైన పోషణ లేని గేదెల్లో అసలు ఆ లక్షణాలే కనిపించవు. సుమారు 50 శాతం గేదెల్లో పునరుత్పత్తి సమస్యలు ఎద లక్షణాలను గుర్తించకపోవడం వల్లే కలుగుతాయి. పాడిపశువుల్లో వచ్చే ఎదను జాగ్రత్తగా గమనించాలి. మూగ ఎదకు వచ్చే పాడి పశువుల్లో ఎదకాలం సాధారణం కన్నా ఎక్కువకాలం ఉండొచ్చు. అవసరమైతే కృత్రిమ గర్భధారణ చేసిన ఆరు గంటలు తర్వాత మళ్లీ గర్భధారణ చేయించాలి. గేదెలు లేదా సంకరజాతి పశువుల్లో ఎదకు వచ్చిన 7, 10 రోజుల్లో మళ్లీ ఎదకు వస్తే గర్భధారణ చేయించాలి. పాడి పశువులు ప్రతి 25 రోజులకు ఒకసారి ఎదకు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో 3 నుంచి 5 నెలల చూడి కాలంలో ఎదకు వస్తాయి. దీనినే చూడి ఎద అంటారు. ఆ సమయంలో వీటికి గర్భధారణ చేయించరాదు.

క్లుప్తంగా

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయం


తహసీల్దార్ అనుపమను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని నూతన తహసీల్దార్ అనుపమ పేర్కొన్నారు. పుట్టపర్తి తహసీల్దార్‌గా అనుపమ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పుట్టపర్తి తహసీల్దార్‌గా నియమించారు. ఈసందర్భంగా ఆమెను కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను పూర్తిగా పరిష్కరించడమే లక్ష్యంగా పని చేయనున్నట్లు చెప్పారు.

డ్రిప్, స్ప్రింక్లర్లకు దరఖాస్తు చేసుకోండి

బత్తలపల్లి: బోరు బావులు కలిగిన రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లు కావలసిన రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్ఎస్‌కేలలో దరఖాస్తు చేసుకోవాలని ఎంఐఏఓ శివశంకర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బిందు, తుంపర సేద్యానికి సంబంధించి(డ్రిప్, స్ప్రింక్లర్లు) అత్యధిక టార్గెట్స్ ఇచ్చిందని తెలిపారు. పరికరాలు కావాల్సిన రైతులు 1బీ, ఎఫ్ఎంబి స్కెచ్, చెక్‌బంది సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, బోర్‌వెల్ కరెంట్ బిల్లుతో రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7995010080 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని చెరువు సమీపంలో రజక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. వేదపండితుడు మంజునాథ శర్మ బృందం ఉదయం పుణ్యాహ వచనం, ఋత్వికరణము, గణపతి పూజ, నాంది, కలశస్థాపన నిర్వహించింది. సాయంత్రం ప్రదోష కాల పూజ, మహాస్నపనం, ఫల, పుష్ప, ధాన్యాది, శయనాది వాసాలు అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రజక అభివృద్ధి కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎంసీ ఎన్నికలు

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో నేడు గురువారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ క్రిష్టానాయక్ తెలిపారు. కాగా మండల వ్యాప్తంగా 59 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో జీనులకుంట ఉర్దూ, చిన్నక్కగారిపల్లి ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడడంతో 57 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి


మాట్లాడుతున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

ఎన్పీకుంట: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసే పంటలన్నింటికీ ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వరరెడ్డి, తహసీల్దార్ నరేంద్ర కుమార్ సూచించారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో బుధవారం వీఆర్ఓ, వీఏఏ, వీహెచ్ఏలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ-క్రాప్ నమోదుపై పలు సూచనలు ఇచ్చారు. సెప్టెంబరు 15లోగా పంటలు సాగు చేసిన ప్రతి రైతు ద్వారా పంట నమోదు చేయించాలన్నారు. ఏ ఒక్కరైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ-క్రాప్ బుకింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. వీఆర్ఓలు, రైతుసేవా కేంద్రం సిబ్బంది క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి పంట నమోదు చేపట్టాలన్నారు.

కృష్ణాష్టమి నిర్వహణకు అనుమతివ్వండి

ముదిగుబ్బ: ఈ నెల 26న స్థానిక బస్టాండ్ వద్ద కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించుకునేందుకు అనుమతిని ఇవ్వాలని బుధవారం ప్రబోధ సేవా సమితి ముదిగుబ్బ శాఖ సభ్యులు పోలీసులను కోరారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతు గత 15 ఏళ్లుగా ముదిగుబ్బ బస్టాండ్‌లో వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


క్రీడల్లో అందుకున్న బహుమతులను చూపుతున్న విద్యార్థులు

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శైలజ, హిందీ పండిట్ వేణుగోపాలాచార్యులు, పీడీ నాగేంద్ర తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. సబ్ జూనియర్ అండర్-16 బాలుర విభాగంలో బాల్ బాడ్మింటన్, షూటింగ్‌బాల్ క్రీడలకు శ్రీ సత్యసాయి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 11,12 తేదీల్లో కుప్పంలో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో విద్యార్థి నందకుమార్, కాకినాడ జిల్లా అన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలలో మనోజ్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీల్లో దొరిగిల్లు విద్యార్థుల ప్రతిభ

ముదిగుబ్బ: ఆర్డీటీ ఆధ్వర్యంలో బత్తలపల్లిలో బుధవారం నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడల్లో దొరిగిల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 200 మీటర్ల పరుగు పందెంలో 9వ తరగతికి చెందిన ఇన్యావతి మొదటి బహుమతి, అలాగే 100 మీటర్ల పరుగు పందెంలో 8వ తరగతికి చెందిన జి.లతకు రెండో బహుమతి, 100 మీటర్ల సీనియర్ విభాగంలో టెన్త్ విద్యార్థిని అంజలి మూడో బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్సాహంగా బాలికల అథ్లెటిక్స్ మీట్


పరుగు పందెంలో పాల్గొంటున్న విద్యార్థినులు

బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో బుధవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏరియా స్థాయి బాలికల అథ్లెటిక్స్ మీట్ నిర్వహించారు. బత్తలపల్లి ఏరియా నుంచి 3, ముదిగుబ్బ ఏరియా నుంచి 5 టీములు పాల్గొన్నాయి. బత్తలపల్లి ఏరియా నుంచి 60 మీటర్లు పరుగు పందెంలో దస్తగిరమ్మ(జెడ్పీ బాలికల హైస్కూల్ బత్తలపల్లి), 100 మీటర్లు పరుగులో ఉషారాణి(కేజీబీవీ, సంజీవపురం), 200 మీటర్లు పరుగులో సాయి పూజిత (కేజీబీవీ, సంజీవపురం), లాంగ్‌జంప్ అండర్ 14లో జశ్విత(జెడ్పీ హైస్కూల్, రామాపురం), అండర్-16లో కాంచన(జెడ్పీ హైస్కూల్, రామాపురం), షాట్‌పుట్‌లో అండర్-14లో మహిత(జెడ్పీ హైస్కూల్, బత్తలపల్లి), అండర్-16లో శిరీష(జెడ్పీ హైస్కూల్, రామాపురం) విద్యార్థినీలు ప్రథమ స్థానంలో నిలిచారు. ముదిగుబ్బ ఏరియా నుంచి 60 మీటర్లు పరుగులో హేమావతి(మల్లేపల్లి స్కూల్), 100 మీటర్లు పరుగు పందెంలో లత(దొరిగిల్లు), 200 మీటర్లు పరుగు పందెంలో ఇన్యావతి(దొరిగిల్లు), షాట్‌పుట్ అండర్-14లో రూప(మల్లేపల్లి), అండర్-16లో హిందుభాయ్ (కేజీబీవీ, ముదిగుబ్బ), లాంగ్‌జంప్ అండర్-14లో శరణ్య(కేజీబీవీ ముదిగుబ్బ), అండర్-16లో హేమావతి(మల్లేపల్లి) ప్రథమ స్థానం కై వసం చేసుకున్నారు. వీరందరికీ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వీరంతా జిల్లాస్థాయిలో జరిగే బాలికల అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీ ప్రమీల, హేమలత, కావేరి, ఏటీఎల్ రుక్మాంగద, పీడీలు లక్ష్మీనారాయణ, భాగ్యలక్ష్మీ, సువర్ణ, శిల్ప, రేఖ, రంజిత్, అనిల్, రుక్మాంగద, కృష్ణ, నాగరాజు, తిమ్మరాజు, శ్రీరాములు, అంజి, రమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం


తాడిమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది


కుమ్మరవాండ్లపల్లిలో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

తాడిమర్రి: తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ సరస్వతి పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లలితమ్మ, చంద్రమ్మ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తాడిమర్రి, దాడితోట క్లస్టర్లలోని అన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు, ఆశావర్కర్లు, బాలింతలు, గర్భిణులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలింతలు, గర్భిణుల సమావేశంలో సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేష్టమైనవి అన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలను తాపాలన్నారు. పాలు తాపితే తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదన్నారు. నవజాత చిన్నారులకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప ఇతర ఆహారం ఏమీ తినిపించ కూడదని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరిత, ఏఎన్ఎం కోమలి, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, అలివేలమ్మ, నాగలక్ష్మీ, జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, డీఎంహెచ్ఓ మంజువాణి పేర్కొన్నారు. బుధవారం ప్రశాంతిగ్రామంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంతకు ముందు సీడీపీఓ కార్యాలయం నుంచి సచివాలయం మీదుగా పీడీ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మ బిడ్డకు ప్రసాదించే మొదటి వరం ముర్రుపాలన్నారు. బిడ్డ పుట్టిన గంట లోపే తల్లిపాలు ఇవ్వడం ఆరంభించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తెచ్చిన పౌష్టికాహారం, కూరగాయలు, ఆకుకూరలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్‌లు భారతి, పుష్ప, కౌసల్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

కదిరి టౌన్/ కదిరి అర్బన్: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీఓ హోం, కుమర్మవాండ్లపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కార్యాక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు అమృతం లాంటివన్నారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. సీడీపీఓ రాధిక, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి, సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓడీ చెరువు: తల్లి పాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని ఐసీడీయస్ సూపర్‌వైజర్ విజయకుమారి పేర్కొన్నారు. గౌనిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు తాపించాలన్నారు. ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త షమీమ్, ఎంఎల్‌హెచ్‌పీ వసుంధర పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను కాపాడండి


గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ధర్మవరం: చేనేత పరిశ్రమను కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీరమణ, కో కన్వీనర్ ఆయుబ్‌ఖాన్ కోరారు. పట్టణంలోని గాంధీనగర్ సర్కిల్ వద్ద బుధవారం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రభుత్వ విధానాలకు నిరసనగా మోకాళ్లపైన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం, చేనేత పరిశ్రమ దేశానికి రెండు కళ్లలాంటివని మహాత్మా గాంధీజీ చెప్పారన్నారు. చేనేత వ్యవస్థ నిర్వీర్యం అవుతోందన్నారు. చేనేత పరిశ్రమ, చేతివృత్తులకు అవసరమైన బడ్జెట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించకపోవడంతో కార్మిక వ్యవస్థ అనేక రకాల కష్టాల ఊబిలో కూరుకుపోతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత వృత్తిని నిర్వీర్యం చేసేలా విధానాలు రూపొందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు అవసరమైన బడ్జెట్‌ను కేటాయించడంతోపాటు ప్రత్యేక చేనేత బ్యాంకును ఏర్పాటు చేయాలని, సబ్సిడీతో ముడి సరుకులు అందించాలని, చేనేత పరిశ్రమలో తయారైన చీరలకు ప్రభుత్వమే మార్కెట్ సౌకర్యం కల్పించి చేనేత కార్మికుల ఆత్మహత్యలు చేసుకోకుండా కాపాడాలని తెలిపారు. చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, హరి, సన్నప్పయ్య, బడిగింజల ప్రకాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్

నల్లమాడ: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై బుధవారం రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కదిరి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, నల్లమాడ ఎస్ఐ రమేష్‌బాబు, ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా స్త్రీలు రాణిస్తున్నారని, మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలను చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. వ్యాసరచన పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఎంవీఐ చేతుల మీదుగా హెల్మెట్లు ప్రదానం చేశారు. హెచ్‌ఎం జంషీర్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక లోడ్ వేస్తే చర్యలు: అధిక లోడ్ వేస్తే చర్యలు తప్పవని ఎంవీఐ వరప్రసాద్, ఎస్ఐ రమేష్‌బాబు ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. నల్లమాడలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించిన వారు పలు సూచనలిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగివుండాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎన్పీకుంట: మండల కేంద్రం సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. వారి నుంచి రూ.4,900 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

మున్సిపాలిటీలో కోల్డ్‌వార్

- కమిషనర్, సిబ్బందికి మధ్య వివాదం
- సెలవులో వెళ్తున్నట్లు మున్సిపల్ ఉద్యోగుల ప్రకటన

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో కోల్డ్‌వార్ జరుగుతోంది. కమిషనర్‌కు సిబ్బందికి మధ్య వివాదం తలెత్తింది. ఈక్రమంలో ఉద్యోగులంతా సామూహిక సెలవులో వెళ్లాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివరాలు.. మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒంటెత్తు పోకడలను ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ప్రతి విషయంలో తమను తప్పుబడుతున్నారని వారు చెబుతున్నారు. ఈక్రమంలో ఉద్యోగులు విధులకు దూరంగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇంక్రిమెంట్లతోనే వివాదం

తమకు రావాల్సిన ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా కమిషనర్ వేధిస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో కమిషనర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడమే గాక అవమానాలకు గురి చేస్తున్నారని చెబుతున్నారు. ప్రతి చిన్న విషయానికి మెమోలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఉద్యోగులను రెండు వర్గాలు చేసి తమ జీవితాలతో ఆడుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజులు క్రితం ఎమ్మెల్యే సింధూరరెడ్డి కూడా విన్నవించినా న్యాయం జరగక పోవడంతో ఉద్యోగ సంఘాల నేతలు జోక్యం చేసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది.

నివాళి


గంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి

నల్లచెరువు: కె పూలకుంట గ్రామానికి చెందిన ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి సోదరుడు పి గంగిరెడ్డి(64) గత నెల 27వ తేదీ గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని గంగిరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


రంగనాయకులు

నల్లమాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా వై.రంగనాయకులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికొచ్చినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా ఇక్కడ విధులు నిర్వహించిన జి. నాగభూషణంను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్లు దేవేంద్రనాయక్, మల్లికార్జున, వీఆర్ఓలు నూతన తహసీల్దార్‌కు అభినందనలు తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికలు పక్కాగా నిర్వహించండి

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణ, రూరల్ పరిధిలోని 101 పాఠశాలల్లో గురువారం తలపెట్టిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓలు గోపాల్ నాయక్, రాజేశ్వరి హెచ్‌ఎంలకు సూచించారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికైన కమిటీ రెండేళ్ల పాటు మనుగడలో ఉంటుందన్నారు. తల్లిదండ్రుల్లో ఇద్దరు వ్యక్తులను మాత్రమే చైర్మన్, వైస్ చైర్మన్లుగా, మిగితా వారిని సభ్యులుగా ఎన్నుకుంటారన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నిక నిర్వహించాలని, మధ్యాహ్నం 3 గంటలకు మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన అక్షయ, రాజమ్మ

తనకల్లు: ఈతోడు టవర్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఈతోడు గ్రామానికి చెందిన రాజమ్మ, అక్షయ ఆటోలో తనకల్లుకు బయలుదేరారు. అయితే టవర్ దాటిన తరువాత మలుపు దగ్గరకు రాగానే ఎదురుగా కారు వేగంగా వచ్చింది. దీంతో కారును తప్పించబోయిన డ్రైవర్ ఆటోను పక్కకు తిప్పాడు. ఆటో అదుపుతప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అక్షయ కాలుకు బలమైన గాయాలు కాగా రాజమ్మ చేతికి, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్షయను కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని నాబార్డ్ డీడీఎం అనురాధ సూచించారు. పట్టణంలోని శారీస్ హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్ శిక్షణ కేంద్రంలో బుధవారం మూడో బ్యాచ్ శిక్షణ ముగిసింది. ఈసందర్భంగా నాబార్డ్ డీడీఎం అనురాధ, రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, వర్డ్ సంస్థ యశోద, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వీర మారుతి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చాన్నారు. శిక్షణ పొందిన వారికి బ్యాంక్ ద్వారా రుణ వసతి కల్పిస్తామని తెలిపారు. ఈసందర్భంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్‌తో పాటు టూల్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో వర్డ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెరువు తహసీల్దార్‌గా నాగరాజు



కొత్తచెరువు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బదిలీపై చిత్తూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా తహసీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని నూతన తహసీల్దార్ పేర్కొన్నారు.